"ఏమి అబ్బా...వీడికి...ఈ కూలిన యింట్లో ఏమిపని—వీడేదో నలుగురికి తెలియరాని పని చేస్తున్నాడు" అనుకొని ఒకరోజు ఆ కూలిన యిల్లంతా గాలించి చూచాడు వర్తకుడు. ముల్లా రహస్యం బయటపడ్డది. 40 దీనారాలు దొరికినాయి వర్తకునికి దొరికిన సొమ్ము మూటగట్టుకొని గప్చిప్‌గా వెళ్ళిపోయినాడు వర్తకుడు. తెల్లవారివచ్చి ముల్లా తననిధిని చూచుకున్నాడు. ఒక్క దీనారమూ కూడాలేదు. ఆలోచనలో పడ్డాడు ముల్లా—"ఇది ఎవరిమాయ కావచ్చు?" చాలసేపు ఈప్రశ్న అతణ్ణి పీడించింది. "ఆ తరవువాడు ఒకడే నా రాకపోకలు చూస్తున్నాడు—వాడికి తప్ప మరోపక్షికి తెలియదు నారహస్యం. సరే! చూద్దాము...వాడు ఏపాటి ఘనుడో" అని నిమ్మళంగా ఆ తరవు వర్తకుని దగ్గరికిపోయి కొంచెం ఈలెక్క చేసిపెట్టండి అని అడిగాడు.

వర్తకుడు "సరే" అన్నాడు.

"నలుబయిదీనారాల్లో యిరువయికలిపితే ఎన్ని అవుతా" యన్నాడు ముల్లా.

"అరువయి" అన్నాడు వర్తకుడు.

"మరో ముప్పయి కలిపితే?"

"తొంబయి"

"ఆ తొంబయిలో మరో నాల్గు కలిపితే?"

"తొంబయినాలుగు" అన్నాడు వర్తకుడు. సరే! మీ శ్రమకు దండాలు అంటు ముల్లా వెళ్ళి పోవడంతోనే వర్తకుడు ఆలోచనలోపడ్డాడు. "యింకా ఎక్కడో వీడు యాబయినాల్గు దీనారాలు దాచిపెట్టినట్టుగా ఉంది. ఈ వెధవ ఆ దీనారాలన్నీ ఆ పాతరలోనే వేస్తాడు గావును? తీరా పాతర తీసేసరికి యిదివరకు దాచిన ధనము లేకపోతే-?—నేను తొందరపడి పాతర పెల్లగించాను ఏమి మునిగింది తొందరపడటానికి? వాడు కూడికచేసే ధనమంతా ఒకేసారి సంగ్రహిస్తే పోతుంది" అని తాను యిదివరకు సంగ్రహించిన ధనమంతా పాతరలో వేసి వచ్చాడు. తెల్లవారి ముల్లాపోయి పాతర చూచుకున్నాడు. తన 40 దీనారాలు మెరుస్తూ కనుపించాయి. "పాచిక పారిందిరా" అని ఆ దీనారాలన్ని మూటగట్టుకొని ఆ తరవు వర్తకుడు చేసిన మేలుకు అతన్ని ఒకసారి పొగడి యింటికి వెళ్ళిపోయాడు.

# ★ యానం ★

నేను ప్రయాణం చేయా లనుకున్నాను.

నడవగా, నడవగా, ఒక నది వచ్చింది.

ఆ నదిని దాటటం ఎలాగా అనుకున్నాను.

నదిలో ఓ పెద్ద చెట్టు కొట్టుకొస్తోంది. అది నా సమీపంలో గట్టు తగిలి ఆగింది.

నేను దానిమీద ఎక్కి కూర్చున్నాను. అది బలే సరదాగా నీళ్ళల్లో ప్రయాణం చేసింది.

ఒకచోట కొందరు మనుష్యులు నా చెట్టును, ఆపుచేశారు.

నేను ఒడ్డుకు దూకాను. వారితో నేను ప్రయాణం చేయాలి, అని చెప్పాను.

వాళ్ళు నాకు వెదురు బొంగులతో కట్టిన తెప్ప చూపారు. దానిమీద ఎక్కాను. ఒకడు, గెడ కర్రతో దాన్ని జాగ్రత్తగా నడిపాడు.

కొంతదూరం పోయాక, మాకు ఓ ఒడ్డు తగిలింది.

అక్కడ, తొలిచిన చెట్లులాంటివి ఉన్నాయి. ఆ దోనెల్లోకి ఎక్కాము. 'రంయ్'మంటూ నదిలో పోనిచ్చాడు.

కొంతదూరం పోయాక, తెల్లటి గుడ్డ తెరలు అగుపించాయి. వాటిని కల్సుకున్నాను. ఆ పడవల్లోకి ఎక్కాను. లోన గదు లున్నాయి. తెరచాప గాలిలో, పడవ రివ్వున కదిలింది!

కొంతదూరం పోయాక, నదిలో పొగలొచ్చాయి. కూతలుకూడా వినపడ్డాయి. ఏమిటా అని చూశాను. పడవలాగే ఉంది. అందులోకి దూకాను.

ఇంజనుతో, రివ్వు రివ్వున పరుగెట్టింది.

ఇంతట్లో, సముద్రం అడుగున శబ్దం అయింది. హాయ్! సబ్ మెరీనట! అందులోకి దిగాను. నీటిలో రయ్‌మంటూ పరుగెట్టింది. ఎంత హాయిగా వుందని!

హాయిగానే వుందండి — పైనుంచి బాంబుల వర్షం కురిసి శాశ్వతంగా నీట మునిగేవరకూ!

—రచన: జి. ప్రభ.